
# ర'చై'ఘాతలూ.. జిందాబాద్

- కోట ఇందిర



**ఓ** ఫైన్ ఈవెనింగ్ హైదరాబాదు బస్సు అమలాపురంలో ఎక్కేశాడు గిరీశం. ఊళ్ళో వాళ్ళందరూ 'తీసుకున్న అప్పు తీర్చమంటే మా బాగా కథలు చెబుతావ్ గిరీశం' అంటూ కితాబు యిచ్చేస్తే ఆ కథలు ఎలాగైనా సినిమా వాళ్ళకి వినిపించేసి, నాలుగు రాళ్ళు మూట కట్టుకొచ్చి ఊళ్ళో అప్పులన్నీ తీర్చేసెయ్యాలనే గట్టి నిర్ణయానికొచ్చేసి, మరో కొత్త అప్పు చేసి మరీ బయలుదేరాడు.

ఆవేశం వివేకాన్ని చంపేస్తుందన్నట్లు కాకుండా తను బయలుదేరి వస్తున్నట్లు బస్టాండ్‌లో తనకి ఏ యిబ్బంది లేకుండా చూసుకోమని శ్రీనాధు పుస్తకాల షాపులో 30 రూపాయలు అరువు పెట్టి మరీ కొన్న ఫిల్మ్ డైరీలో ప్రముఖ దర్శక నిర్మాతలకి టెలిగ్రాంలను యిచ్చాడు.

సీటు నెంబరు చూసుకుని లగేజి బ్యాగును పైన సర్ది భుజానికి తగిలించుకునే సంచీని మాత్రం వొళ్ళో పెట్టుకుని గట్టిగా పట్టుకు కూర్చున్నాడు.

పైన వున్న బ్యాగ్ పోయినా పర్వాలేదు. అందులో వెధవది నాలుగు జతల బట్టలు సబ్బు, పేస్టు వగైరాలున్నాయి. తన చేతిలో వున్న సంచిలో ప్రముఖ హీరోలను దృష్టిలో పెట్టుకుని రాసిన పది కథలున్నాయి ఈ సంచీ పోతే యింకేమన్నా ఉందా? అసలు ఆ ఊహకే గిరీశం గుండె ఘుభేల్ మంది.

బస్సు బయలుదేరటానికి మరో అయిదు నిమిషాలు టైముండటంతో వూహల్లో మునిగిపోయాడు గిరీశం.

"గిరీశమన్నా! గిరీశమన్నా" అంటూ అరుపులు వినిపించటంతో ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. గిరీశం కోసం బస్సుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నాడు శివుడు.

శివుడు సుబ్బయ్య శెట్టి కొడుకు. వాడి వయసు పాతికేళ్ళు. దానికి తగ్గ తెలివి లేదు వాడికి. 'శివుడూ! వస్తున్నా వుండు' అంటూ బస్సులోంచి ప్లాట్‌ఫాం మీదకు ఒక్క గెంతు వేశాడు గిరీశం.

"ఏంటి? గిరీశమన్నా! నువ్వు హైదరాబాదు యెల్తున్నావనే విషయం నాకు మాట మాత్రం కూడ చెప్పనేలేదు." అన్నాడు గిరీశాన్ని నిలదీస్తున్నట్లు నిష్టూరంగా.

గిరీశం ఏదో సమాధానమిద్దామని నోరు తెరిచే లోపలే "పోన్లే! అన్నా. కొంచెం ఈ కవరు నేనిచ్చానని రంభకియ్యన్నా" అన్నాడు తెగ యిదిగా సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ.

"ఓరి! నీ దుంప తెగ. నేను బొందితో స్వర్గానికి వెళ్ళటానికి నేనేమీ మునిని కాదురా" అన్నాడు గిరీశం కంగారుగా శివుడు కవరు యిమ్మన్న రంభ ఎవరో అర్ధం కాక.

"ఏంటన్నా మరీ యింత యెటకారమా? నేనిమ్మంది స్వర్గంలో రంభకి కాదు. సినిమాల్లో రంభకి." అన్నాడు శివుడు ఈ సారి మరింతగా మెలికలు తిరిగిపోతూ.

"ఏముంది..... ఇందులో" అన్నాడు గిరీశం కవరందుకుని జేబులో దోపుకుంటూ.

"హిఁ... హిఁ" అంటూ రెండుసార్లు సొండిచ్చి చేతులు నలుపుకో సాగాడు శివుడు.

"సర్లే! యేముంటే నాకెందుకు? నువ్వు యిమ్మన్నావని రంభకిచ్చేస్తాను" అన్నాడు గిరీశం.

"ఏం లేదులే అన్నా! మనూరి తిరనాళ్ళల్లో మూడేళ్ళ క్రితం నేను దిగిన కలర్ ఫొటో ఓ ఉత్తరం వుందందులో అంతే." అన్నాడు శివుడు విషయం చెప్పకపోతే ఆ ఉత్తరం రంభకి చేర్చడేమోనని భయం వేసి.

"ఓహ్! ప్రేమలేఖా?" అన్నాడు గిరీశం వాడి వంక చూసి విలాసంగా నవ్వుతూ.

"ఊఁ" అంటూ తల ఊపాడు శివుడు.

బస్సు బయలుదేరుతోందన్నట్లు సిగ్నల్‌గా హారను మ్రోగించాడు డ్రైవరు. బస్సు వైపు కదిలాడు గిరీశం.

"అన్నా! బాగుంది కదాని ఆ కలర్ ఫొటో నువ్వుంచేసుకోబాక. కావాలంటే నువ్వు తిరిగొచ్చాక యింకోటి ఇస్తాను. అట్టాగే రంభ నాకేదన్నా ఇమ్మని ఇస్తే దాన్ని మర్చిపోమాక. భద్రంగా తెచ్చి,నాకిచ్చెయ్" అంటూ, బస్సు బయలుదేరేముందు అరుస్తూ చెప్పాడు శివుడు.

ఈసారి వాడ్నేం అనలేక ఓ వెర్రి నవ్వు నవ్వాడు గిరీశం. బస్సు కదులుతూ వుండటంతో, డ్రైవరు తన దగ్గర వున్న లిస్ట్ ప్రకారం ఓసారి

ప్యాసింజర్లందరినీ చెక్ చేసుకుని, సంతృప్తి చెంది బస్సును పాయింట్ లోంచి రివర్స్ చేశాడు.

"గోవిందా.... గోవిందా!" అంటూ గట్టిగా అరిచాడు గిరీశం. బస్సులో అందరూ కూడ కోరస్ ఇవ్వటంతో డ్రైవరు సడెన్ బ్రేకు వేసి బస్సును ఆపేశాడు. తను పొరపాట్న హైదరాబాదు బస్సుకు బదులుగా తిరుపతి బస్సు ఎక్కానేమో అనే భయంతో.

ముందుకెళ్ళి బోర్డు, నెంబరు చూసుకుని అది తనెక్కవలసిన బస్సేనని నిర్ధారించుకున్నాక ఆర్.టి.సి. మీద ప్రజలకున్న నమ్మకానికి ఒక్క క్షణం బిత్తరపోయాడు.

చేతిలో సంచీని గట్టిగా పట్టుకుని పక్క సీటు వంక చూశాడు గిరీశం. సరిగ్గా అదే సమయానికి తన ప్రక్కన కూర్చున్నది దొంగ వెధవా? మంచి వెధవా? అనుకుంటూ ఓసారి కళ్ళజోడు సవరించుకుని మరీ అనుమానంగా చూశాడు. ప్రక్క సీటు ముసలాయన. బస్సు హైవే ఎక్కటంతో లైట్లార్పి వి.సి.పి ఆన్ చేశాడు డ్రైవరు.

గిరీశం కళ్ళు పత్తికాయల్లా విచ్చుకున్నాయి.

ప్రక్క సీటు ముసలాయన ఇదేం పట్టనట్లు క్షణాల్లో నిద్రలోకి జారుకుని 'గుర్రు' పెట్టసాగాడు సినిమా మొదలయ్యి అరగంట అయినా డైలాగులన్నీ ముసలాయన గుర్రులో కలిసిపోయి సినిమా అర్థం కాక పోవటంతో టాకీ యుగంలో మూకీ సినిమా చూడటం చేతకాక "ఛీ! దీని ఎంకమ్మ" అనుకుంటూ నిద్రకోసం బలవంతంగా కళ్ళు మూసుకున్నాడు గిరీశం.

ఎవరో ఛెళ్ళున వీపున చరిచినట్లు మెలకువ రావటంతో కళ్ళు విప్పాడు. అప్పటికే సగం మంది బస్సు దిగిపోయారు మిగిలిన వాళ్ళు దిగుతున్నారు.

"ఏ ఊరండి ఇది?" అన్నాడు దిగటానికి లేవబోతున్న పక్క సీటు ముసలాయన్ని కంగారుగా. "కళ్ళు కనిపించట్లా?! అందరూ లగేజీ తీసుకుని దిగిపోతున్నారంటే వచ్చింది హైదరాబాదే అన్న ఇంగితం కాస్తయినా ఉండక్కర్లా!" అంటూ పొద్దున్నే గిరీశంని ఆశీర్వదించి దిగాడాయన.

ఆ మాటకి బస్సులోంచి ప్లాట్ ఫాం మీదకి ఒక్క గెంతు గెంతాడు గిరీశం.

"త్రాగునీరు" అన్న బోర్డున్న పంపు దగ్గర ముఖ ప్రక్షాళన చేసుకుని, బస్టాండ్ క్యాంటీన్‌లో కాఫీ అని పిలవబడే వేడి నీళ్ళు త్రాగాక కొంచెం స్థిమితపడ్డాడు. సరిగ్గా బస్టాండ్ నాలుగు దిక్కులూ తనని రిసీవ్ చేసుకోవటానికి రావల్సిన ప్రముఖ దర్శక, నిర్మాతల కోసం పరికించి మరీ చూశాడు. "రచయితలంటే ఈ సినిమా వాళ్ళకి బొత్తిగా గౌరవం లేకుండా పోయింది" కోపంగా హుంకరించాడు.

తను ముందస్తుగా వెళ్ళాల్సిన వాడిని, లాటరీ పద్ధతిలో ఎంపిక చేసుకుని బస్టాండులోంచి సిటీ బస్టాపుకేసి దారి తీశాడు.



## స్వాగతం

'చక్రీ' షార్ట్ టెంపర్. మనసులో వున్న మాట దాచుకోకుండా బయటికి అనేస్తాడు. అందుకే చాలా మంది నిర్మాత, దర్శకులకు మింగుడు పడడు. ప్రస్తుతం 'చక్రీ' ఆశలన్నీ 'ప్రేమకు స్వాగతం' చిత్రం మీదే! యస్వీకే దర్శకత్వం మీద నమ్మకం వున్నా, సౌందర్య అదృష్టం మీదే నమ్మకం లేదంటున్నారు కొందరు. ప్రేమకు స్వాగతం చిత్రం చక్రవర్తి కెరీర్‌కి ఎలా స్వాగతం చెబుతుందో వేచి చూడాల్సిందే!

పావు గంటకి నిండు గర్భిణిలా విచ్చేసిన జూబ్లీహిల్స్ బస్సులోకి అభిమన్యుడిలా జొరపడ్డాడు. ఆపైన తృప్తిగా ఓ దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు మెట్ల మీద నుండి పైకి వెళ్ళగల్గినందుకు.

"టికెట్! టికెట్" అంటూ వచ్చిన కండక్టర్ చేతిలో విలాసంగా ఓ పది నోటును పెట్టి "భీమారావ్! ఇంటికి ఓ టికెట్ యివ్వు." అన్నాడు దర్పంగా.

"భీమారావా? గాడెవడు భాయ్? ఆంధ్రాకి సి.యమ్మా? కౌన్ బనేగా కరోర్‌పతి యాంకరా?" అన్నాడు కండక్టర్ వ్యంగ్యంగా గిరీశం వంక గుడ్లురిమి చూస్తూ.

జీన్సు ప్యాంటు, టీషర్ట్‌లో నిల్చున్న ఓ అమ్మాయి కిసుక్కున నవ్వింది. దాంతో గిరీశంకి మా చెడ్డ కోపం తన్నుకొచ్చింది. ఆంధ్రాలో పుట్టి భీమారావ్ అంతటి మెగా ప్రొడ్యూసరు, డైరక్టరు తెలియని కండక్టరు మీద జాలి తన్నుకొచ్చింది.

"భీమారావ్ ఎవరో నీకు నిజంగా తెలియదా?" అన్నాడు కండక్టర్ వంక చూస్తూ.

"నాకాడెవడో తెల్వదు భాయ్! నువ్వెడ దిగాలో చెప్పు" అన్నాడు కండక్టర్ కరుకుగా.

"జూబ్లీహిల్స్" అన్నాడు భీమారావ్ లాంటి వ్యక్తి తెలియని కండక్టర్‌తో పోట్లాడటం నామోషిగా అనిపించి "కయ్యానికైనా - వియ్యానికైనా సమ ఉజ్జీ ఉండాలి" అంటూ చిన్నప్పుడు గిరీశం తాత చెప్పిన మాట గుర్తొచ్చి.

కండక్టర్ టికెట్, చిల్లర చేతిలో పెట్టి ముందుకు వెళ్ళిపోయాడు. గిరీశం ప్రక్క వ్యక్తి ఒక్కసారి ధఢేల్‌మని గిరీశం కాలు తొక్కాడు అతనికి తెలియకుండానే గిరీశం నోటి వెంట ఓ చావు కేక తన్నుకొచ్చింది.

మళ్ళీ జీన్స్ ప్యాంటు అమ్మాయి కిసుక్కున నవ్వింది.

తన కాలు తొక్కిన కాలు తాలూకా ఓనర్‌ని తిట్టటానికి నోరు తెరిచాడు గిరీశం.

"ఊర్కోండి...., మాస్టారు. ఇక్కడ ఇవన్నీ మామూలే" అంటూ ఊరడించాడు గిరీశం బాధను గమనించిన ప్రక్కనున్న బట్టతలాయన.

ముప్పావు గంట ముప్ప తిప్పలు పడి జూబ్లీహిల్స్‌లో ఎడమకాలు పెట్టి బస్సు దిగాడు గిరీశం. సరిగ్గా అదే సమయానికి బంగాళా ఖాతంలో వాయు గుండం పడింది.

"భీమారావ్ గారింటికి దారెటు?" అంటూ ఓ బండి దగ్గర నూనెలో పూరీలు వేయిస్తున్న వ్యక్తిని ఎంతో వినయంగా అడిగాడు.

"నేను చెప్పను" అన్నాడా వ్యక్తి సీరియస్‌గా.

ఆ సమాధానం అర్థం గాక, బిత్తరపోయి తల గోక్కున్నాడు గిరీశం. తను అడిగిన దాంట్లో తప్పు ఏమైనా ఉందా? అని ఆలోచిస్తూ.

"నా బండి దగ్గర రెండు ప్లేట్ల పూరీలు తినీ, ఛాయ్ తాగి బిల్లు కడితే భీమారావ్ గారిల్లు నేను దగ్గర నిలబడి మరీ చూపిస్తాను" అన్నాడు బండి వాడు అంతే సీరియస్‌గా.

అప్పుడు గుర్తొచ్చింది గిరీశంకి నిన్నరాత్రి ఇంటి దగ్గర భోం చెయ్యటం తప్ప ఇప్పటి వరకూ తనింకా టిఫిను కూడా చెయ్యలేదనే విషయం. తినటం కంటే ముఖ్యంగా ఆ బండి వాడు పెట్టిన కండీషన్ నచ్చింది. వాడి దగ్గర టిఫిన్ చేస్తే దగ్గరుండి భీమారావ్ గారిల్లు చూపిస్తానన్నాడు. రెండు నిమిషాల్లో రెండు ప్లేట్ల పూరీలు ఖాళీ చేసి ఒక్క గుక్కలో మురికి నీళ్ళలా వున్న టీని త్రాగి బిల్లుకు డబ్బులు వాడి చేతిలో పెట్టి 'బ్రేవ్'మని త్రేన్చాడు గిరీశం.

చిల్లర తిరిగి ఇస్తున్న బండివాడితో 'ఇప్పుడు చూపించు భీమారావ్ గారిల్లు' అన్నాడు.

బండివాడు నిల్చున్న చోటు నుండి అంగుళం కూడ కదలకుండానే 'ఆ ఎదురుగా కనిపించే తెల్ల

మేడే....సార్! భీమారావ్‌గారిల్లు' అన్నాడు తన నిజాయితీని చాటుకుంటూ.

అప్పటికి అర్థమైంది గిరీశంకి బండివాడి వ్యాపార కిటుకు. "అబ్బా! అమలాపురం వాళ్ళకంటే హైదరాబాదు వాళ్ళు చాలా తెలివైన వాళ్ళు" అనుకుంటూ మనసులోనే కితాబిచ్చేశాడు.

"భీమారావ్ గారిల్లు దొరకటంతో, రెట్టింపు ఉత్సాహంతో మెయిన్ గేటు వైపు దూసుకుపోయాడు.

"ఠైరో! ఠైరో!! కౌన్ హై తుమ్" అంటూ తన చేతిలోని బలమైన లాఠీని గిరీశం గొంతు మీద పెడుతూ మొహంలో మొహం పెట్టి కర్కశంగా అడిగాడు గేటు ముందు స్టూలు మీద కూర్చుని బీడి దమ్ము పీకుతున్న గూర్ఖావాలా.

"మేరా నాం గిరీశం! భీమారావుగారి దోస్తే. భీమారావ్‌గారిని అర్జెంట్ దేఖా" అంటూ తన హిందీ భాషా ప్రావీణ్యాన్ని ప్రదర్శించి గూర్ఖావాలాని పడగొడదామని చూశాడు.

"సాబ్! అందర్ నహీహై... బాహర్ ఛల్‌గయా" అంటూ గొంతు మీద లాఠీని తియ్యకుండానే మరింత కర్కశంగా బదులిచ్చాడు గూర్ఖావాలా.

ఏం చెయ్యాలో అర్థం కాక ఒక్క క్షణం బుర్ర గోక్కున్నాడు గిరీశం. వెంటనే అయిడియా మెరుపులా మెరవటంతో జేబులో చెయ్యి పెట్టి, ఓ వంద నోటు తీసి గూర్ఖా కళ్ళ ముందు ఆడించాడు.

"సాబ్ ఘర్ మేహై" అంటూ వంద నోటు ఆబగా లాక్కున్నాడు అతను. గిరీశం పెదవుల మీద విజయగర్వంతో ఓ చిరునవ్వు మెరిసింది. ఓసారి బట్టలు, క్రాపును సరిచేసుకుంటూ దర్జాగా లోపలకి అడుగెయ్యబోయాడు.

"అందర్ జానా నకో!" అంటూ మళ్ళీ లాఠీని రెండు కాళ్ళ మధ్యన అడ్డంగా పెట్టడంతో ధబ్బున క్రిందపడిపోయాడు గిరీశం. ముక్కు నుండి బొట, బొటా గిద్దెడు రక్తం కారింది పాపం. బట్టల కంటిన మట్టి దులుపుకుంటూ గూర్ఖావాలా వంక కోపంగా చూశాడు.

"నువ్విచ్చిన వందకి నేను చెప్పిన సమాధానంతో చెల్లు" అన్నట్లు నవ్వుతూ చూశాడు గూర్ఖావాలా. మరోవంద నోటు అతనికి అందించి ఉస్సూరు మంటూ గేటు దాటి లోపలకి నడిచాడు. లోపల భీమారావ్ పి.ఏ.కి మరో మూడు వందలు చదివించుకుని భీమారావ్ గారు నిద్రపోతుండడంతో విజటర్స్ రూంలో ఆయన దర్శనార్థం నిరీక్షిస్తూ కూలబడ్డాడు.

మధ్యాహ్నం రెండు గంటలకి ఆవలిస్తూ ఆగదిలో కొచ్చారు భీమారావ్‌గారు. గదిలో ఓ మూలగా కుర్చీలో కూర్చుని ఏదో రాస్తున్న గిరీశం వంక చూస్తూ చిన్నగా దగ్గాడు. అయినా గిరీశంలో ఏ విధమైన రియాక్షన్ కనిపించలేదు.

రెండుసార్లు అరిచాడు. అయినా గిరీశం తలతిప్పలేదు.... దాంతో చేతికందిన ఫ్లవర్ వేజ్ విసురుగా నేలకేసి కొట్టాడు. అయినా ఫలితం శూన్యం. గబ, గబా గిరీశం దగ్గర కొచ్చి వీపు మీద బలంగా రెండు చరుపులు చరిచాడు.

అప్పుడు తలెత్తి ఆశ్చర్యంగా భీమారావ్‌ని చూసి కంగారుగా లేచాడు గిరీశం.

"పర్వాల్లేదు! కూర్చోండి అంటూ గిరీశం రెండు భుజాలు పట్టుకుని బలవంతంగా కుర్చీలో కూలేశాడు భీమారావ్.

ఒద్దికగా కుర్చీలో కూర్చున్నాడు భీమారావ్ గోళ్ళు రెండు భుజాలలో గుచ్చుకుని నొప్పి పెడుతున్నా, మోహమంతా నవ్వు పులుముకుంటూ.

"మీరు! రచయితలా?" అన్నాడు భీమారావ్ గిరీశం వంక సంభ్రమంగా చూస్తూ.

"అవును సార్!" అన్నాడు గిరీశం ఆనందం గొంతులో వెలక్కాయలా అడ్డుపడుతుండగా.

"ఇంతకు ముందు మీరేం చేసేవారు." అన్నాడు భీమారావ్ అభిమానంగా.

"జీడిపాకం వ్యాపారం చేసే వాడిని సార్... అరువులు ఎక్కువై పోయి అప్పుల పాలై దివాళ తీశాను" అన్నాడు బాధనంతా గొంతులో నింపుకుని.

"వెరీగుడ్! మీ లాంటి రైటర్ కోసమే వెతుకుతున్నాను" అన్నాడు భీమారావ్ ఆనందంగా. ఆ మాటతో గిరీశం మొహం చాటంతయింది.

"నేనో ప్రముఖ ఛానల్‌కి ఓ మెగా డైలీ సీరియల్ నిర్మిస్తున్నాను దానికి కథ, మాటలు మీరే రాస్తున్నారు" అన్నాడు భీమారావ్ హామీ ఇస్తున్న ధోరణిలో.

"అదేంటి? సార్! నేను మీ సినిమాకి కథ, మాటలు రాద్దామని వచ్చాను" అన్నాడు గిరీశం బాధగా. ఓ రెండు గంటల పాటు గిరీశం గతంలో చేసిన "జీడిపాకం" వ్యాపారం రచయితగా గిరీశంకి ఎలా ఉపయోగపడుతుందో సినిమా రైటర్ కంటే డైలీ సీరియల్ రైటర్‌కి ఉన్న లాభాలేంటో ఎడ్యుకేట్ చేసి పారేశాడు భీమారావ్.

ఆ దెబ్బకి గిరీశం టీ.వి సీరియల్స్‌కే రాయాలని ఫిక్స్ అయిపోయాడు. దివాళా తీయించి అప్పుల పాల్జేసిన తన 'జీడిపాకం' వ్యాపారం ఈ రకంగా తనకి కూడు పెడుతున్నందుకు మనసులోనే తెగ ఆనందించేశాడు.

భీమారావ్! తను తియ్యగలిగే డైలీ సీరియల్ ఎన్నాళ్ళయినా సాగదియ్యగలిగే రచయిత దొరికినందుకు గిరీశం కంటే ఎక్కువ ఆనందించాడు.

ఓ ఆర్నెల్ల తరువాత ఓ ప్రముఖ ఛానల్‌లో గిరీశం రాసిన "ఛూ.... యాక్" డైలీ సీరియల్ ప్రారంభమైంది.

కథతో సంబంధం లేని పాత్రలతో, పాత్రలకి సంబంధం లేని డైలాగులతో సూపర్బ్‌గా సాగిపోతోందా సీరియల్.

ఆ సీరియల్ కథ పక్క వారికి చెప్పటానికి సాధ్యం కాకపోవటం వల్ల ఎవరికి వారుగానే చూస్తున్నారు ప్రేక్షకులు.

ఆ తరువాత కాలంలో 'నరకయాతన' 'పరమహింస' లాంటి మెగా సీరియల్స్‌ను రాసి పేరు, ప్రతిష్టలు, అవార్డులు సంపాయించి వూళ్ళో అప్పులన్నీ తీర్చి 50 ఎకరాల మాగాణికి ఆసామి అయ్యాడు గిరీశం.

❋

